

## 15న లోక్‌సభ తొలి సమావేశం!

న్యూఢిల్లీ, జూన్ 7: 18వ లోక్‌సభ తొలి సమావేశాలు ఈ నెల 15న ప్రారంభమయ్యే అవకాశం ఉన్నదని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన ఎంపీలతో ప్రమాణస్వీకారం చేయించనున్నారు. రెండు రోజులపాటు ఈ కార్యక్రమం కొనసాగనున్నది. అనంతరం లోక్‌సభకు కొత్త స్పీకర్‌ను ఎన్నుకోనున్నారు. ఆ మరుసటి రోజు పార్లమెంట్ ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారని అధికార వర్గాలు వెల్లడించాయి. సమావేశాల తేదీలపై కొత్త క్యాబినెట్ నిర్ణయం తీసుకోనున్నది. జూన్ 22తో సమావేశాలు ముగుస్తాయి. ఆదివారం రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణ స్వీకారం అనంతరం మంత్రివర్గం సమావేశం కానున్నది.

## ఏడాదిలోపే దేశంలో మధ్యంతర ఎన్నికలు

**ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేశ్ బఘేల్ జోస్యం**

న్యూఢిల్లీ, జూన్ 7: దేశంలో ఏడాది లోపే మనం మధ్యంతర లోక్‌సభ ఎన్నికలను చూడబోతున్నామంటూ కాంగ్రెస్ నేత, ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ శుక్రవారం జోస్యం చెప్పారు. 'పార్టీ కార్యకర్తలారా మరోసారి ఎన్నికలకు సిద్ధంగా ఉండండి. ఆరు నుంచి ఏడాది లోపు దేశంలో మధ్యంతర ఎన్నికలు రాబోతున్నాయి' అంటూ బహిరంగ సమావేశంలో బఘేల్ పిలుపునిచ్చారు. పదేండ్ల పాలనలో పార్టీలను విచ్ఛిన్నం చేసిన, సీఎంలను బెదిరించిన, జైలుకు పంపిన, దర్యాప్తు సంస్థలతో వేధించిన వారికి ప్రజలు తగిన విధంగా బుద్ధి చెప్పారని బఘేల్ పేర్కొన్నారు.

## తగ్గిన వందేభారత్ వేగం

**సగటు వేగం గంటకు 76 కిలో మీటర్లే**

న్యూఢిల్లీ, జూన్ 7: బీజేపీ ప్రభుత్వం గొప్పగా చెప్పుకొనే వందే భారత్ రైళ్ల సగటు వేగం గత అయిదేండ్లలో 8 కిలోమీటర్లు తగ్గింది. 2020-21లో గంటకు 84.48 కి.మీ.గా ఉన్న వేగం 2023-24 నాటికి 76.25 కి.మీలకు పడిపోయింది. వీటి గరిష్ఠ వేగం గంటకు 160 కి.మీ. కాగా ఎక్కడా అది 130 కి.మీ. దాటిన దాఖలాలు లేవు. ఢిల్లీ-ఆగ్రా మార్గం లాంటి నిర్దిష్ట మార్గాల్లో మాత్రమే గంటకు 160 కి.మీ వేగంతో ప్రయాణించడానికి అనువైన ట్రాక్‌లను నిర్మించామని ఒక అధికారి చెప్పారు.

## సిక్కిం సీఎంగా 10న తమాంగ్ ప్రమాణం

గ్యాంగ్‌టక్ : ఎస్‌కేఎం చీఫ్ పీఎస్ తమాంగ్ సిక్కిం ముఖ్యమంత్రిగా ఈ నెల 10న ప్రమాణ స్వీకారం చేస్తారని ఆ పార్టీ ప్రకటించింది. ఆయన ఆదివారం ప్రమాణ స్వీకారం చేస్తారని మొదట్లో ఆ పార్టీ తెలిపింది. కానీ ప్రధాని మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ఆదివారం హాజరుకాబోతున్నారు. దీంతో తన ప్రమాణ స్వీకారాన్ని సోమవారానికి వాయిదా వేసినట్లు ఎస్‌కేఎం తెలిపింది.

## పరువు నష్టం కేసులో రాహుల్ గాంధీకి బెయిల్

బెంగళూరు: కర్ణాటక బీజేపీ శాఖ దాఖలు చేసిన పరువు నష్టం కేసులో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి బెయిలు మంజూరైంది. రూ.75 లక్షల పూచీకత్తును సమర్పించాలని ప్రత్యేక కోర్టు ఆయనను ఆదేశించింది. ఈ కేసులో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివ కుమార్‌లకు కూడా ఈ నెల 1న బెయిలు మంజూరు చేసింది. కర్ణాటక శాసనసభ ఎన్నికలకు ముందు, '40 పర్సెంట్ సర్కారు' అంటూ తప్పుదోవ పట్టించే ప్రకటనలను ఇచ్చారని బీజేపీ ఈ కేసు దాఖలు చేసింది.

## ల్యాండ్ ఫర్ జాబ్ కేసులో లాలూపై తుది చార్జిషీట్

న్యూఢిల్లీ: 'ఉద్యోగం కోసం భూమి' కుంభకోణం కేసులో సీబీఐ తుది చార్జిషీటును ప్రత్యేక కోర్టులో శుక్రవారం దాఖలు చేసింది. ఈ కేసులో మాజీ రైల్వే మంత్రి, బీహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన కుటుంబ సభ్యులు నిందితులు. లాలూ, ఆయన కుటుంబ సభ్యులు రైల్వే అధికారులతో కుమ్మక్కై, ఉద్యోగార్థుల నుంచి భూమిని కారుచౌకగా తీసుకుని, అందుకు బదులుగా రైల్వే ఉద్యోగాలను ఇప్పించినట్లు సీబీఐ ఆరోపించింది. ఈ చార్జిషీటును జూలై 6న ప్రత్యేక న్యాయస్థానం పరిశీలిస్తుంది.

# కమలం పార్టీలో కలవరం

- సొంతంగా మ్యాజిక్ ఫిగర్‌ను అందుకోని బీజేపీ
- బలంగా ఉందనుకున్న రాష్ట్రాల్లోనే ఎదురుగాలి
- అధికారంలోకి వచ్చినా నేతలు, శ్రేణుల్లో నైరాశ్యం
- ముంచుకొస్తున్న మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు
- పార్టీలో మొదలైన అసంతృప్తి.. గొంతెత్తుతున్న నేతలు
- అభ్యర్థుల ఎంపికలో అధి నాయకత్వంపై విమర్శలు



న్యూఢిల్లీ, జూన్ 7: కమలం పార్టీలో లోక్‌సభ ఎన్నికల ఫలితాలు కల్లోలం సృష్టిస్తున్నాయి. భారీగా సీట్లు తగ్గిపోవడం, సొంతంగా మ్యాజిక్ ఫిగర్ అందుకోకపోవడం పట్ల పార్టీ నేతలు, శ్రేణుల్లో తీవ్ర నైరాశ్యం నెలకొన్నది. మూడోసారి అధికారం చేపడుతున్నప్పటికీ ఎక్కడా ఆ ఆనందం కనిపించడం లేదు. పైగా అసమ్మతి మొదలైంది. పదేండ్ల తర్వాత మోదీ - షా నాయకత్వంపై మొదటిసారి అసంతృప్త నేతలు గళమెత్తుతున్నారు. అభ్యర్థుల ఎంపికలో లోపాలు జరిగాయని పరోక్షంగా నాయకత్వం తప్పులను ఎత్తి చూపుతున్నారు. దీంతో బీజేపీలో గతంలో లేని విధంగా అసమ్మతి కనిపిస్తున్నది.

**ఫడ్నవీస్ రాజీనామా.. యోగిపై ఒత్తిడి**

లోక్‌సభ ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు వివిధ రాష్ట్రాల్లో బీజేపీ నాయకత్వానికి మింగుడు పడటం లేదు. గత ఎన్నికల్లో మహారాష్ట్రలో ఎన్డీఏ కూటమికి 41 సీట్లు రాగా ఈసారి కేవలం 17 సీట్లే దక్కాయి. 23 సీట్ల నుంచి బీజేపీ బలం తొమ్మిది స్థానాలకు పడిపోయింది. దీంతో పార్టీ వైఫల్యానికి బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేస్తానని ఫడ్నవీస్ ప్రకటించారు. ఈ పరిణామాలకు సంబంధించి శివసేన(ఉద్ధవ్) నేత సంజయ్ రౌత్ చేసిన వ్యాఖ్యలు మరింత కీలకంగా మారాయి. యూపీలో ఫలితాలకు బాధ్యత వహిస్తూ యూపీ ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలిగేలా యోగి ఆధిత్యనాథ్‌పై ఒత్తిడి తెచ్చేందుకే ఫడ్నవీస్ రాజీనామా ప్రకటన చేశారని సంజయ్ రౌత్ వెల్లడించారు. ప్రధాని మోదీకి ఫడ్నవీస్ సన్నిహితుడు కావడం ఇక్కడ గమనార్హం.

**పార్టీ నాయకత్వంపై అసమ్మతి**

గత పదేండ్లుగా బీజేపీలో నరేంద్ర మోదీ - అమిత్ షా నాయకత్వానికి ఎదురులేకుండా ఉండేది. అయితే, ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఆశించిన ఫలితాలు సాధించకపోవడంతో మొదటిసారి మోదీ - షా ద్వయంపై అసంతృప్తి మొదలైంది. ఉత్తరప్రదేశ్‌లో పార్టీ పేలవ ప్రదర్శనకు కేంద్ర నాయకత్వానిదే బాధ్యత అని ముఖ్యమంత్రి యోగి మద్దతుదారులు పరోక్షంగా ఆరోపిస్తున్నారు. యూపీలో 29 స్థానాలు బీజేపీకి తగ్గడానికి ప్రధాన కారణం అభ్యర్థుల ఎంపిక అని లేవనెత్తుతున్నారు. కాగా, అభ్యర్థుల ఎంపికలో యోగిని పక్కనపెట్టారని వీరు గుర్తు చేస్తున్నారు. బెంగాల్‌లోనూ 18 సానాల నుంచి 12 స్థానాలకు బీజేపీ పడిపోవడం పట్ల అసంతృప్తి మొదలైది. రాష్ట్ర బీజేపీ కీలక నేత, అసెంబ్లీ ప్రతిపక్ష నేత సువేంధు అధికారిని ఉద్దేశించి పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు దిలీప్ ఘోష్ పరోక్ష విమర్శలు గుప్పించారు. పది మంది కొత్త కార్యకర్తలను వదులుకున్నా పర్వాలేదు కానీ ఒక్క పాత కార్యకర్తను కూడా నిర్లక్ష్యం చేయవద్దని ఆయన సువేందును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తనను చివరి నిమిషంలో సిట్టింగ్ స్థానం నుంచి తప్పించి మరో స్థానంలో పోటీ చేయించడాన్నీ తప్పుబట్టారు. మరోవైపు రాజస్థాన్‌లోనూ బీజేపీ గత ఎన్నికల్లో సాధించిన సీట్ల కంటే 11 స్థానాలను కోల్పోయింది. టికెట్ల కేటాయింపులో తప్పులు జరిగాయని, రైతుల సమస్యలు కూడా ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలకు కారణమని ఆ రాష్ట్రమంత్రి, సీనియర్ నేత జబర్ సింగ్ ఖర్రా బాహాటంగానే మాట్లాడటం పార్టీలో చర్చనీయాంశమైంది.

**సవాల్‌గా కొత్త అధ్యక్షుడి ఎంపిక**

మోదీ, అమిత్ షాకు సన్నిహితుడిగా పేరున్న ప్రస్తుత బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పదవీకాలం త్వరలో ముగియనుంది. దీంతో కొత్త అధ్యక్షుడి ఎంపిక మోదీ - షా ద్వయానికి సవాల్‌గా మారింది. ఈ ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాకపోవడంతో ఇంతకాలం సైలెంట్‌గా ఉన్న మోదీ, షా వ్యతిరేక నేతలు ఇప్పుడు తెరమీదకు వచ్చే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీలో వ్యవస్థాగత మార్పులు, నాయకత్వ మార్పు కోరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ముఖ్యంగా కొత్త అధ్యక్షుడి ఎంపికలో ఈ లోక్‌సభ ఎన్నికల ఫలితాల ప్రభావం ఉండే అవకాశం ఉందంటున్నారు. ఈ ఎన్నికల్లో ఎంపీలుగా మరోసారి గెలిచిన నితిన్ గడ్కరీ, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు పెద్దపీట వేయాల్సిన పరిస్థితులు రావొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

### మూడు రాష్ట్రాల్లో మరో పరీక్ష

ఒకవైపు లోక్‌సభ ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాక నైరాశ్యంలో ఉన్న బీజేపీకి త్వరలోనే మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్‌లో మరో పరీక్ష ఎదురుకానున్నది. ఈ ఏడాదే ఈ మూడు రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ మూడు రాష్ట్రాల్లో లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ భారీగా నష్టపోయింది. గత ఎన్నికల్లో సాధించిన సీట్లలో సగం సీట్లు కోల్పోయింది. మహారాష్ట్రలో ఫడ్నవీస్ రాజీనామా ప్రకటనతో పార్టీలో అనిశ్చితి నెలకొన్నది. జార్ఖండ్‌లో మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ అరెస్టుతో జేఎంఎంపై సానుభూతి ఉంది. హర్యానాలో జేజేపీతో పేచీ, రైతుల సమస్యలు, అగ్నిపథ్ పథకం బీజేపీకి ఇబ్బందికరంగా మారాయి. ఈ నేపథ్యంలో ఈ మూడు రాష్ట్రాల్లో బీజేపీకి అనుకూల పరిస్థితులు కనిపించడం లేదు. దీంతో బీజేపీకి ఈ ఎన్నికలు మరో పరీక్షగా మారాయి.



ఎన్డీయే లోక్‌సభ పక్ష సమావేశంలో పాల్గొన్న మోదీ, నితీశ్ తదితరులు

## కాంగ్రెస్‌కికపతనమే

మొదటిపేజీ తరువాయి...

చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇంకో పదేండ్లు అయినా 100 సీట్లు దాటదని చురకలంటించారు. ఎన్డీయే సాధించిన గెలుపునకు గుర్తింపు లభించకుండా, ఓటమి భావనను కల్పించేందుకు ప్రతిపక్ష నేతలు ప్రయత్నిస్తున్నారని, ఈ ప్రయత్నాలు ఫలించవని అన్నారు. ఈ ఎన్నికల్లో తాము ఓడిపోలేదని చిన్నపిల్లాడికి కూడా తెలుసని, ఎన్డీయే నిన్న ఉందని, నేడు, రేపు కూడా ఉంటుందని అన్నారు. సంఖ్యాపరంగా చూస్తే తమది సంకీర్ణాల చరిత్రలోనే బలమైన సంకీర్ణ ప్రభుత్వమని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి మెజార్టీ అవసరమని, దేశాన్ని నడిపించడానికి ఏకాభిప్రాయం ముఖ్యమని పేర్కొన్నారు. దేశ ప్రజలు తమకు ప్రభుత్వాన్ని నడిపించేందుకు మంచి మెజార్టీ ఇచ్చారని, దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఏకాభిప్రాయాన్ని సాధించేందుకు నిర్విరామంగా ప్రయత్నించే బాధ్యత తమదేనని అన్నారు. ఎన్డీయే అంటే న్యూ ఇండియా(కొత్త ఇండియా), డెవలప్డ్ ఇండియా(అభివృద్ధి చెందిన ఇండియా), యాస్పిరేషనల్ ఇండియా(ఆకాంక్షల ఇండియా) అని ఆయన కొత్త అర్థం చెప్పారు. గత పదేండ్ల తమ పాలన కేవలం ట్రైలర్ మాత్రమేనని, ఇప్పుడు దేశాభివృద్ధి కోసం మరింత వేగంగా, కష్టపడి పని చేస్తామన్నారు.

**ప్రతిక్షణం రాజ్యాంగ విలువల కోసమే**

అంబేద్కర్ ఇచ్చిన భారత రాజ్యాంగంలోని గొప్ప విలువలను నిలబెట్టడం కోసం తన జీవితంలో ప్రతి క్షణం పని చేస్తానని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. రాజ్యాంగం వల్లనే పేదరికం, వెనుకబడిన కుటుంబంలో జన్మించిన తన లాంటి వ్యక్తి దేశానికి సేవ చేయగలుగుతున్నారని, మన రాజ్యాంగం కోట్లాది మందికి ఆశ, బలం, గౌరవాన్ని ఇచ్చాయని పేర్కొన్నారు.

**అద్వానీ, జోషీని కలిసిన మోదీ**

ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ నేతగా ఎన్నికైన తర్వాత ప్రధాని మోదీ.. బీజేపీ సీనియర్ నేతలు ఎల్‌కే అద్వానీ, మురళీ మనోహర్ జోషీని వారి నివాసాలకు వెళ్లి కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను సైతం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

### ఆదివారం సాయంత్రం మోదీ ప్రమాణం

ప్రధానమంత్రిగా మూడోసారి నరేంద్ర మోదీ ఆదివారం సాయంత్రం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ నేతగా మోదీ ఎన్నికైన తర్వాత ఆయన రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారు. ఎన్డీయే ఎంపీల జాబితాను అందించారు. ఎన్డీయే నేతలు కూడా తమ మద్దతు తెలియజేస్తూ లేఖలు ఇచ్చారు. దీంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా రాష్ట్రపతి ఆహ్వానించారు. రాష్ట్రపతి భవన్‌లో ఆదివారం సాయంత్రం 7.15 గంటలకు ప్రధాని సహా మంత్రులు ప్రమాణస్వీకారం చేస్తారని రాష్ట్రపతి భవన్ తెలిపింది.

# టీడీపీకి 3.. జనసేనకు ఒకటి!

**కూటమి పార్టీలకు 15 మంత్రి పదవులు**

**నేతలతో బీజేపీ అగ్రనేతల విస్తృత చర్చలు**

న్యూఢిల్లీ, జూన్ 7: కేంద్రంలో కొలువుదీరనున్న బీజేపీ సంకీర్ణ ప్రభుత్వంలో చేపట్టబోయే మంత్రుల పదవులపై కూటమి పార్టీలతో మంతనాలు ఆరంభమయ్యాయి. ఆదివారం జరిగే మోదీ ప్రమాణ స్వీకారంతో పాటు మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది. 15 మంత్రి పదవులను కూటమి పార్టీలకు కేటాయించాలని బీజేపీ యోచిస్తున్నది. దీనిలో భాగంగా ఆ పార్టీ సీనియర్ లీడర్లు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డాలు సంకీర్ణ పార్టీల నేతలతో శుక్రవారం సాయంత్రం విస్తృతంగా చర్చలు జరిపారు.

**కీలక శాఖలు బీజేపీ వద్దే..**

ముఖ్యమైన హోం, విదేశీ వ్యవహారాలు, రక్షణ, ఆర్థిక శాఖలతో పాటు రైల్వే, రోడ్డు రవాణా, న్యాయ, ఐటీ, విద్యాశాఖలను కూడా తమ వద్దే అట్టిపెట్టుకోవాలని బీజేపీ భావిస్తున్నది. కూటమిలో బీజేపీ తర్వాత 16 మంది ఎంపీలతో రెండో స్థానంలో ఉన్న టీడీపీకి మూడు మంత్రి పదవులు ఇవ్వనున్నట్టు సమాచారం. వీటిలో ఒకటి కేబినెట్, రెండు సహాయ మంత్రుల ఉండొచ్చని తెలిసింది. జనసేన పార్టీకి కేబినెట్ హోదా, లేదా స్వతంత్ర హోదా ఉన్న సహాయ మంత్రి, 12 సీట్లు గెల్చుకున్న నితీశ్‌కు చెందిన జేడీ(యూ)కు మూడు (ఒకటి కేబినెట్, రెండు సహాయ) మంత్రి పదవులు ఇవ్వనున్నట్టు సమాచారం.

# బలహీనపడ్డ బీజేపీ

- భాగస్వామ్య పక్షాలపై ఆధారపడాల్సిన పరిస్థితి
- సంకీర్ణ ప్రభుత్వంలో ఏకాభిప్రాయ సాధన తప్పదు
- నిర్ణయాలు తీసుకోవడం ఆలస్యం అవుతుంది
- చర్చలు, రాజీ వంటి సాధనాలు వాడాల్సి వస్తుంది
- లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై మూడీస్ విశ్లేషణ

న్యూఢిల్లీ, జూన్ 7: నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రి కాబోతున్నప్పటికీ, బీజేపీ బాగా బలహీనపడిందని 'మూడీస్ అనలిటిక్స్' పేర్కొన్నది. ఈ మేరకు శుక్రవారం 'భారత ఎన్నికల సమీక్ష: సంకీర్ణ ప్రభుత్వంలోకి బీజేపీని చేర్చిన ఓటర్లు' పేరుతో ఒక నివేదికను విడుదల చేసింది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు పార్లమెంటులో లెక్కలు మార్చాయని, సంకీర్ణ ప్రభుత్వంలో నిర్ణయాలు తీసుకోవడం భాగస్వామ్య పక్షాలు ప్రభావాన్ని, పరపతిని పెంచుకుంటాయని పేర్కొన్నది. సంకీర్ణ ప్రభుత్వాన్ని నడిపించేందుకు బీజేపీ ఇప్పుడు చర్చలు, రాజీ వంటి సాధనాలు వినియోగించాల్సిన అవసరం ఏర్పడుతుందని అభిప్రాయపడింది. ఇది ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యానికి కారణం అవుతుందని, బీజేపీకి కీలకంగా ఉండే నిర్ణయాల నుంచి పక్కకు తప్పుకోవాల్సి రావొచ్చని పేర్కొన్నది.

**రాజకీయ స్థిరత్వం తగ్గింది**

ఈ దఫాలో రాజకీయ స్థిరత్వం తగ్గడం, సంకీర్ణ ప్రభుత్వంలో ఏకాభిప్రాయ సాధన అవసరం ఉండటం వంటి అంశాలు పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని తగ్గిపోవచ్చని మూడీస్ అనలటిక్స్ అసోసియేట్ ఎకనమిస్ట్ అదితి రామణ్ పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం, అధిక నిరుద్యోగం, సామాజిక - ఆర్థిక అసమానతలు, తదితర దీర్ఘకాల సవాళ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం ఎలా వ్యవహరిస్తుందనేది మార్కెట్లు గమనిస్తాయని తెలిపారు. సంకీర్ణ ప్రభుత్వం ఎంత ప్రభావవంతంగా నిర్ణయాలు తీసుకొని, అమలు చేస్తుందనే దానిపై రానున్న ఐదేండ్లలో భారత అభివృద్ధి ఆధారపడి ఉంటుందని ఈ నివేదిక పేర్కొన్నది. కీలక ఆర్థిక సవాళ్ల విషయంలో విధానాల రూపకల్పనలో ప్రభుత్వ ప్రాధాన్యతలు ఎలా ఉంటాయనేది ఈ బడ్జెట్ ద్వారా తెలియబోతున్నదని తెలిపింది. మౌలిక సదుపాయాలు అభివృద్ధి, సేవలు, తయారీ రంగంలో ప్రభుత్వం మూలధన వ్యయం ఎలా చేస్తుందనేది కూడా చూడాల్సి ఉందని పేర్కొన్నది.




## ఈడీ చర్య చట్ట విరుద్ధం

- 180 కోట్ల ఇల్లు జప్తుపై కోర్టు తీర్పు
- ఎన్సీపీ నేత ప్రఫుల్ పటేల్‌కు ఊరట

ముంబై: అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ నేత ప్రఫుల్ పటేల్‌కు భారీ ఊరట లభించింది. ప్రఫుల్‌కు సంబంధించిన రూ.180 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ జప్తు చేయడం చట్టవిరుద్ధమని ముంబై కోర్టు తీర్పు చెప్పింది. స్మగ్లర్స్ అండ్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మానిపులేటర్స్ చట్టం కేసులను విచారించే అప్పిలేట్ ట్రిబ్యునల్ ఈ తీర్పు చెప్పింది. దక్షిణ ముంబైలోని సీజే హౌస్‌లో ఉన్న 12వ, 15వ అంతస్థులను ఈడీ గతంలో జప్తు చేసింది. ఈ ఆస్తులు ప్రఫుల్ భార్య వర్ష, ఆయన కంపెనీ మిలినియం డెవలపర్స్ పేరిట ఉన్నాయి. అయితే వీటిని డ్రగ్స్ మాఫియా నేత, దావూద్ రైట్ హ్యాండ్‌గా భావించే ఇక్బాల్ మిర్చీ భార్య నుంచి చట్టవిరుద్ధంగా పొందినట్టు ఈడీ ఆరోపిస్తున్నది. అయితే ఈ ఆస్తులు ఇక్బాల్ మిర్చీకి సంబంధించినవి కాదని, మనీలాండరింగ్ జరిగినట్లు ఆధారాలు లేవని ట్రిబ్యునల్ తీర్పు చెప్పింది. తాజా పరిణామాలపై శివసేన నేత సంజయ్‌రౌత్ స్పందించారు. సీబీఐ, ఈడీ అనేవి బీజేపీ కనుసన్నల్లో పనిచేస్తున్నాయని అనేందుకు ఇదే నిదర్శనమన్నారు.




## సోలార్ ప్యానళ్ల నుంచి ఈవీలకు ఛార్జింగ్

జోధ్‌పూర్, జూన్ 7: సౌర విద్యుత్తు ద్వారా ఎలక్ట్రిక్ వాహనాలను ఛార్జింగ్ చేసేలా కొత్త అడాప్టర్‌ను ఐఐటీ జోధ్‌పూర్ అభివృద్ధి చేసింది. రూ.1,000 లోపే ఈ అడాప్టర్ ధర ఉంటుందని ఐఐటీ జోధ్‌పూర్ ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ నిశాంత్ కుమార్ తెలిపారు. అన్ని రకాల ఎలక్ట్రిక్ వాహనాలకు ఈ అడాప్టర్‌తో ఛార్జింగ్ పెట్టవచ్చని, త్వరలోనే దీనిని మార్కెట్‌లోకి అందుబాటులోకి తీసుకురానున్నట్టు ఆయన ప్రకటించారు.

## గ్యాస్ స్టవ్ పక్కన నూనె పెడితే క్యాన్సర్ ముప్పు!



న్యూఢిల్లీ: వంట చేసేటపుడు అందుబాటులో ఉంటుందని చాలామంది వంటనూనెను గ్యాస్ స్టవ్‌కు పక్కనే ఉంచుకుంటారు. ఇలా చేయడం ఆరోగ్యానికి చేటు అని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. క్యాన్సర్ సహా రకరకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని చెబుతున్నారు. గ్యాస్ స్టవ్ పక్కనే నూనె బాటిల్స్ ఉంచడం వల్ల ఆక్సిడైజేషన్ ప్రక్రియ వేగవంతమవుతుందని పేర్కొంటున్నారు. వంట నూనెల్లో అధిక కొవ్వు పదార్థాలు ఉంటాయి. నూనె సీసాను లేదా ప్యాకెట్‌ను తెరచిన వెంటనే ఈ కొవ్వు పదార్థాలు క్షీణించడం మొదలవుతుంది. ఫలితంగా ఆ నూనె రుచి మారుతుంది. దుర్వాసన వస్తుంది. ఇటువంటి నూనెను వాడటం వల్ల వేగంగా ముసలితనం వస్తుంది. కొలెస్ట్రాల్ లెవెల్ పెరుగుతుంది. ఊబకాయం, బరువు పెరగడం, జీర్ణ సంబంధిత సమస్యలు వంటివి బాధిస్తాయి.

**నూనెలను ఎలా నిల్వ చేయాలి?**

నూనెలను తీసుకొచ్చిన సీసాలు, కవర్లలోనే ఉంచడం, గాలి, వెలుతురు చొరబడకుండా గట్టిగా మూత పెట్టడం శ్రేయస్కరం. వెజిటబుల్ ఆయిల్స్‌ను చల్లని, వెలుతురు తగలని చోట్ల నిల్వ ఉంచాలి. మూత తెరిచిన తర్వాత 3 నుంచి 6 నెలల్లోగా ఉపయోగించాలి. వాల్‌నట్, హేజెల్‌నట్, ఆల్మండ్ నూనెలను ఫ్రిజ్‌లో పెట్టాలి.

### నాడు పోలీస్ బూట్ కింద నలిగి.. నేడు ఎంపీగా ఎదిగి..



ఫొటోలో ఐపీఎస్ కాళ్ల కింద నలిగిపోతున్న వ్యక్తి పేరు ఆనంద్ బదౌరియా. 2011లో సమాజ్‌వాదీ నేత అఖిలేశ్‌ను అరెస్ట్ చేసినందుకు నిరసనగా లక్నోలో జరిగిన ఆందోళనలో ఆయన చురుగ్గా పాల్గొన్నప్పుడు ఈ ఘటన జరిగింది. తాజా లోక్‌సభ ఎన్నికల్లో దౌర్హరా స్థానం నుంచి గెలిచిన ఆనంద్ బదౌరియా పార్లమెంటులో సగర్వంగా అడుగు పెట్టనున్నారు. అవమానానికి కుంగిపోకుండా కష్టాలను ధైర్యంగా ఎదుర్కొన్న ఆయన పట్టుదలను నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.

## కంగనను కొట్టిన కానిస్టేబుల్ అరెస్ట్

- కుల్విందర్‌కు రైతు సంఘాల సంఘీభావం
- ఎంపీ వ్యాఖ్యలపై ఆగ్రహం.. విచారణకు డిమాండ్

చండీగఢ్: మండి ఎంపీ, బాలీవుడ్ నటి కంగనా రనౌత్‌ను చెంప దెబ్బ కొట్టిన సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ కుల్విందర్ కౌర్‌ను అరెస్ట్ చేసినట్టు శుక్రవారం పోలీసులు వెల్లడించారు. మరోవైపు నిందితురాలికి ఎస్కేఎం(రాజకీయేతర) తదితర రైతు సంఘాలు సంఘీభావం తెలిపాయి. ఘటనపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశాయి. ఎస్కేఎం నాయకుడు జగ్జీత్ సింగ్ మాట్లాడుతూ తన పర్స్, మొబైల్ ఫోన్ తనిఖీ జరుగుతున్నప్పుడు కంగన కుల్విందర్‌తో వాదనకు దిగిందన్న వార్తలు వచ్చాయని.. ఇదే నిజమైతే అందుకు కుల్విందర్‌ను బాధ్యురాలిని చేయడం తగదన్నారు. పంజాబ్‌లో ఉగ్రవాదం పెరుగుతున్నదన్న కంగన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు.



**వెయ్యి ఉద్యోగాలైనా వదులుకుంటా**

తనను విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు సీఐఎస్ఎఫ్ వెల్లడించగానే కుల్విందర్ కౌర్ ఎక్స్‌లో స్పందించారు. 'ఈ ఉద్యోగం పోతుందనే భయం నాకు లేదు. నా తల్లి గౌరవం కోసం ఇలాంటి ఉద్యోగాలు వెయ్యి అయినా వదులుకోవడానికి నేను సిద్ధం' అని ఆమె వ్యాఖ్యానించారు.

## ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం 'యశస్వి' స్కాలర్‌షిప్

**ప్రారంభించిన ఏఐసీటీఈ**

న్యూఢిల్లీ: సివిల్, కెమికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ ఇంజినీరింగ్ (సీసీఈఈఎం) డిగ్రీ, డిప్లొమా విద్యార్థులను ప్రోత్సహించేందుకు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) స్కాలర్‌షిప్ పథకాన్ని ప్రారంభించింది. 'యంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్ అండ్ హోలిస్టిక్ అకడమిక్ స్కిల్స్ వెంచర్ ఇనీషియేటివ్ (యశస్వి) పేరుతో ఈ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. దీనిని శుక్రవారం ఏఐసీటీఈ చైర్మన్ ప్రొఫెసర్ టీజీ సీతారామ్ ప్రారంభించారు. మాన్యుఫ్యాక్చరింగ్ ఇండస్ట్రీస్ అభివృద్ధి చెందాలంటే ఇంజినీరింగ్‌లోని ఈ బ్రాంచ్‌లు చాలా ముఖ్యమైనవని సీతారామ్ చెప్పారు. ఏఐసీటీఈ ఆమోదం గల టెక్నికల్ ఇన్‌స్టిట్యూషన్లలోని ఈ బ్రాంచ్‌ల్లో చేరే ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం కోసం ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. డిగ్రీ విద్యార్థులకు సంవత్సరానికి రూ.18,000 చొప్పున గరిష్ఠంగా నాలుగేళ్ల వరకు, డిప్లమో విద్యార్థులకు సంవత్సరానికి రూ.12,000 చొప్పున గరిష్ఠంగా మూడేళ్ల వరకు ఉపకార వేతనం ఇస్తారని తెలిపారు. ప్రతి సంవత్సరం 2,500 మంది డిగ్రీ విద్యార్థులకు, 2,500 మంది డిప్లమో విద్యార్థులకు ఈ సదుపాయం కల్పించనున్నట్లు చెప్పారు.

## ఏడుగురు నక్సల్స్ మృతి

- ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్
- ముగ్గురు జవాన్లకు గాయాలు

కొత్తగూడెం క్రైం: దండకారణ్యం మళ్లీ తుపాకీ మోతతో దద్దరిల్లింది. భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య శుక్రవారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు. నారాయణ్‌పూర్-దంతేవాడ జిల్లాల సరిహద్దుల్లో మావోయిస్టులు సంచరిస్తున్నట్లు పోలీస్ అధికారులకు సమాచారం అందింది. దీంతో నారాయణ్‌పూర్, కొండగావ్, దంతేవాడ, జగ్దల్‌పూర్ జిల్లాల డీఆర్‌జీ బలగాలు, ఐటీబీపీ 45వ బెటాలియన్ భద్రతా బలగాలు సంయుక్తంగా ఆ ప్రాంతాన్ని జల్లెడ పట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టులు తారసపడి జవాన్లపైకి కాల్పులు జరిపారు. అయితే జవాన్లు సైతం నాలుగు వైపుల నుంచి మూకుమ్మడి దాడి చేయడంతో మావోయిస్టులు తప్పించుకునే మార్గం లేకపోయినట్లు తెలుస్తున్నది. దాడుల్లో సుమారు 1,200 మంది జవాన్లు పాల్గొన్నట్లు సమాచారం. దీంతో మావోయిస్టులు తప్పించుకునే దారిలేక కాల్పుల వేగాన్ని పెంచుకుంటూ అటవీ మార్గం నుంచి పారిపోయారు. ఘటనా స్థలం నుంచి ఏడుగురు మావోయిస్టుల మృతదేహాలతోపాటు కొన్ని ఆయుధాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఘటనలో ముగ్గురు జవాన్లకు సైతం గాయాలైనట్లు సమాచారం.

## వారంలో 1,400 మందికిపైగా ఉద్వాసన

**మైక్రోసాఫ్ట్, గూగుల్‌లో ఉద్యోగాల కోతలు**

న్యూఢిల్లీ: ఐటీ, ఇతర రంగాల్లో ఉద్యోగుల తొలగింపులు కొనసాగుతూనే ఉంది. జూన్ తొలి వారంలో 1400 మందికిపైగా ఉద్యోగాలు కోల్పోయారు. గూగుల్, మైక్రోసాఫ్ట్, ఓర్కమ్, ఒడా తదితర సంస్థలు ఉద్యోగులకు పింక్ స్లిప్‌లను అందించాయి. హోలోలెన్స్ 2, అజూర్ మూన్ షాట్స్ విభాగాల్లో వెయ్యి మందికిపైగా ఉద్యోగులపై మైక్రోసాఫ్ట్ వేటు వేసింది. సంస్థ పునర్ నిర్మాణం, వ్యయ నియంత్రణలో భాగంగా వీరిని తొలగిస్తున్నట్టు ప్రకటించింది.